ప్రేమ

"చదువూ సంధ్యా లేదు కాని అయ్యగారికి షోకులెక్కువ" వెక్కిరింతగా మాట్లాడింది మా అమ్మ.

నాకున్న రెండు జతల దుస్తులు

లవ్ స్టోరీ

చిరిగిపోవడానికి దగ్గరవుతుండడంతో కొత్త వాటిని కుట్టించమని అడిగిన దానికి మా అమ్మ ఇచ్చిన జవాబు అది.

"పో... మార్కెట్‌కు వెళ్ళి సరుకులు పట్రా పో" గద్దించినట్టు అందామె.

లుంగీ మీద వున్న నేను పక్కగదిలో వున్న నా బట్టలను హాంగరు నుండి తీసి వేసుకున్నాను. బాగా శిథిలమయ్యాయవి.

డబ్బులు తీసుకొని మెల్లగా రోడ్డు మీద నడవసాగాను.

ఆలోచనలు - మనసులో ఎడతెరపి లేకుండా.... మనసును తినేస్తున్నాయి.

పద్దెనిమిదేళ్ళ వయసు నాది. ఇంటర్‌మీడియెట్ రెండుసార్లు తప్పడంతో అంతక్రితం వరకు మా వాళ్ళ దృష్టిలో ఇంటెలిజెంట్‌నైన నేను అప్పుడు పనికిమాలినవాడుగా, చేతగాని దద్దమ్మగా మిగిలిపోయాను. జీవితంలో ఎదురు దెబ్బలు తింటున్న మనిషిని ఎవ్వరూ ఆదుకోరు సరికదా అతనిలోని లోపాలు ఎత్తిచూపుతారు. ఈ విషయం ఈ ఏడదిన్నరలో నాకు బాగా అర్థం అయింది.

"శ్యాం ఎక్కడికో వెళ్తున్నావ్" ఎవరో అడిగినట్టు అనిపిస్తే ఆలోచనలను కొద్దిగా ఆపి తేరుకున్నాను.

సవిత-

ఆగలేకుండా వున్న ఆలోచనలలో కూడా ఆమెను చూస్తే ఎందుకో చిరునవ్వు నవ్వాలనిపించింది.

"ఎక్కడికో వెళుతున్నావ్" మళ్ళీ అడిగింది.

"కిరాణా కొట్టుకు వెళ్తున్నాను" ముభావంగా జవాబు ఇచ్చాను.

"ఈ రోజు ఎందుకు అదోలా వున్నావ్?"

ఎదుటి మనిషి మానసిక స్థితి గ్రహించడం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుంది.

"అదోలా వున్నానా?... బాగానే వున్నానే" ఆగి "నేను వెళతాను. లేటయితే మళ్ళీ ఇంట్లో పురాణం వినాల్సి వస్తుంది" అన్నాను మాట మారుస్తూ.

ఏమనుకుందో -

"సరే వెళ్ళు" అంటూ తను ఇంటి వైపు దారి తీసింది.

సవిత- మా ఇంటి ఓనరు వాళ్ళ అమ్మాయి. నా కన్నా రెండు సంవత్సరాలు పెద్దది. ప్రస్తుతం తను డిగ్రీ చేస్తూంది. ఇవన్నీ ఒదిలిపెడితే సవిత చాలా గొప్పది- ఎదుటి వ్యక్తిని అంచనా వేయడంలో నాకు తెలిసినంత వరకు ఎప్పుడూ తప్పు చేయలేదు. అందుకే నేమో తనెప్పుడూ నన్ను చులకన చేసి మాట్లాడలేదు. నా పరిస్థితి, మా ఇంట్లో వాళ్ళ పరిస్థితి ఆమెకు బాగా తెలుసు. మా ఇంటివాళ్ళ మాటల వల్ల నేను కృంగినప్పుడల్లా తనే నన్ను ఆత్మ న్యూనత అనే అగాధంలో పడిపోకుండా కాపాడింది.

* * *

ఈ మధ్య నాకో ఆలోచన వచ్చింది.

'ఇన్ని మాటలు పడ్తూ నా వాళ్ళ మధ్య వుండే బదులు ఎక్కడికైనా వెళ్ళి కనీసం కూలీ చేస్తూ అయినా బ్రతకొచ్చు కదా!' వచ్చిన ఆలోచనకు వెంటనే కార్యరూపం ఇవ్వదలిచాను.

ఇంట్లోంచి వెళ్ళిపోతున్న విషయం ఎవరికీ చెప్పదలచుకోలేదు.

కానీ-

సవితతో కూడా చెప్పకుండా పోవడం - నా మనసెందుకో అంగీకరించలేదు.

ఆ రోజు సాయంత్రమే నేను సవితను కలిసాను.

"చూడు శ్యామ్. నీవ్వు ఇంట్లోంచి పిరికివాడిలా కాకుండా, ధైర్యంగా ప్రపంచాన్ని ఎదుర్కొనటానికి, నీదంటూ ఒక లోకాన్ని

3-1-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

సృష్టించుకోవడానికి వెళుతున్నావని నేను అర్థం చేసుకోగలను. కానీ- తెలివైన వాళ్ళ లక్షణం అది కాదు. ఇప్పుడు నీవు మీ ఇంట్లోంచి బయటికి వెళితే నీ ఇంటర్ చదువుకు ఆటంకం కలుగుతుంది. అలా అని నేను చదువే లోకం అని అనను. మీ వాళ్ళు ఇన్ని దినాలు ఏ విషయం మీదయితే నిన్ను చులకనగా చూసారో వాళ్ళ ముఖాన చెప్పతో కొట్టినట్టు నీవు ఇంటర్ పాస్ కావాలి. అప్పుడు అప్పుడు... ఇంట్లోంచి బయటకు వెళ్ళు. అంత వరకు నీ ఇంట్లో నిన్ను ఎన్ని సూటి పోటి మాటలన్నా భరించు. ఎందు కంటే నీకు వారితో అంతవరకు అవ సరం వుంటుంది'' నా ఆలోచనలు విని సవిత ఇచ్చిన జవాబు ఇది.

ఇంత పూర్తి సమాధానం ఇచ్చే వాళ్ళు నాకు అంతవరకు ఎదురు పడలేదు. అందుకేనేమో ఆమె చెప్పిన మాటలకు నా మనసు తల వంచింది.

* * *

గట్టిగా రేడియో శబ్దం వినిపించ డంతో మళ్ళీ లోకంలోకి వచ్చిపడ్డాను.

సాయంత్రం సమయం కావడం వల్ల దూరంగా పాన్ షాప్‌లో పెట్టిన రేడియో లోంచి వార్తలు వస్తున్నాయి.

''క్రితం సప్లిమెంటరీలో పరీక్షలు వ్రాసిన ఇంటర్‌మీడియెట్ విద్యార్థుల పరీక్ష ఫలితాలు ఈ రోజు ప్రకటిం చారు'' వార్తలలో ఒక అంశం విని పించింది.

ఇంతకుముందులా పరీక్షా ఫలితాలు వచ్చినందుకు నేను బాధపడలేదు. ఇప్పుడు మనస్సు దృఢంగా వుంది. నేను పరీక్షలు పాసవుతాను అనే ఒక నిర్లిప్త భావన వల్లనేమో.

సరుకులు తీసుకుని నెమ్మదిగా ఇంటికి బయలుదేరాను.

నేను ఇచ్చిన డబ్బును, పచారీ సామాను బిల్లును చూసి అమ్మ తలా డించింది సరిగ్గా వున్నట్టు.

''కడవ... మంచి నీళ్ళు తెచ్చి పెట్టు. ఇంట్లో నీళ్ళు పూర్తిగా విండు కున్నాయి.'' ఆజ్ఞాపించింది అమ్మ.

నీటి బోరింగ్ పంపు మా ఇంటికి నాలుగు వీధుల అవతల వుంది. దాదాపు అర కిలోమీటరు.

విచిత్రంగా నాకేమీ బాధ అని పించలేదు. 'ఎంత చేసినా ఈ ఒక్క రోజుకే కదా' అనే సంతృప్తి భావం వుందక్కడ.

* * *

ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచాను. మా ఊర్లో వున్న బస్‌స్టాండ్ దగ్గరకు వెళ్ళాను. అప్పటికే దిన పత్రికలు వచ్చేసాయి.

పేపరు చదువుతున్న అతన్ని అడి గాను నా నెంబరు కాస్త చూసి పెట్ట మని.

''పాసయినావు బాబు'' అయిదు నిమిషాల తరువాత చెప్పా డతను.

కళ్ళలో నీళ్ళు ఉబికి రాసాగాయి. నేనేమీ వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు. అంతవరకూ మనసులో గూడు కట్టుకొన్న నిరాశలు, అవ మానాల్ని అలా కన్నీటి రూపంలో పోనీయడమే మంచిదనిపించింది.

కొద్ది సమయం తరువాత...

లేచి నిదానంగా ఇంటి వైపు దారి తీసాను.

నేను ఇంటికి వెళ్ళే సమయానికే మా ఇంట్లో వాళ్ళందరికీ విషయం తెలిసిపోయింది. ఎలా తెలిసింది అని నేను ఆలోచించలేదు- సవిత చెప్పి వుంటుంది.

''వాడు పాసవుతాడని నాకు ముందే తెలుసు!'' అన్నాడు నాన్న.

''వాడికి బట్టలు కావాలట కుట్టిం చండి'' సిఫార్సు చేసింది నా కన్నతల్లి.

''ఎక్కడికి వెళ్ళావురా ఇంత ఉద యమే!'' తనకి అవసరం అయితే తప్ప మాట్లాడని మా అన్న కొత్తగా, మెత్తగా పలకరించాడు.

మనుషులు ఎంత తొందరగా తమ భావాలను మార్చేసుకుంటారో నాకు అనుభవమే! అందుకే వారి మాటలకు నేను పొంగిపోలేదు. నాకెందుకో మురికి కూపంలో వున్న ట్టనిపించింది.

నిర్లిప్తంగా రోజు గడిచింది.

సాయంత్రం సమయం.

అంతవరకూ నేను సవితను చూడలేదు కావాలనే.

సంధ్య చీకట్లు ముసురుకొంటూం డగా నేను మా డాబా మీద వున్న సవిత దగ్గరకు వెళ్ళాను.

ఆకాశంలో ఎర్రని వర్ణం ఇంకా పోలేదు. లేత నలుపు, ముదురు ఎరుపు కలిసి ఒక కొత్త రంగును విరజి మ్ముతున్నాయి.

''ఏమిటి ఈ రోజు కూడా సంతోషంగా లేవా?'' అడిగింది సవిత నా వాలకం చూసి.

''నిన్నో విషయం అడగుతాను సమాధానం చెబుతావా'' అన్నాను ఆమె మాటలు పట్టించుకోకుండా.

వింతగా చూసి ''అడుగు'' అన్నది.

''నేను ఈ రోజే ఇంట్లోంచి వెళ్ళి పోతున్నాను. నీకు ఇష్టమయితే నా వెంట రాగలవా?''

ఊహించని ఈ మాటలకు షాక్ తింటుందని అనుకున్నాను.

ఆశ్చర్యం!

భావాలకు అతీతంగా వుందామె మోము.

''సవితా- నిన్ను పొగడడం అని కాదు కానీ నీవు ఎన్నో సార్లు చేయూతనివ్వడం వల్లనే నేను ఇప్పుడు ఈ విధంగానైనా వున్నాను. క్రితం సారి నువ్వన్నట్టు మా ఇంటివాళ్ళ కోరిక ప్రకారం అవసరం అనే ముసుగు వేసుకొని పరీక్షలు పాస య్యాను. దానితో పాటు నాకున్న బంధాలన్నీ తెగిపోయాయి. ఇప్పుడు నేను బంధాలకు అతీతుణ్ణి. అటు వంటప్పుడు నీవు లేకుండా నేను బ్రతకలేను అనడం మళ్ళీ నా మూర్కత్వం కావచ్చు-కానీ నీ సాహ చర్యం మాత్రం నాకు కావాలి అనేది చాలా నిజం. నీ తోడులో నేను ప్రపంచాన్ని జయించగలను అని నేను చెప్పను. కానీ ప్రయత్నిస్తాను అని మాత్రం చెప్పగలను. నీకు అష్ట ఐశ్వ ర్యాలు ఇవ్వకపోవచ్చు కానీ నీకు కష్టం మాత్రం రాకుండా చూసుకోగలను అని మాటిస్తాను. నీకు ఇష్టమయితే ఈ రోజు రాత్రికి మనం వెళ్ళిపోదాం- మన కంటూ ఒక కొత్త ప్రపంచాన్ని వెతుక్కుంటూ'' పెదాలు అవిరా మంగా కదిలాయి.

ఆమె వైపు చూసాను. నిశ్చలంగా, యోగినిలా డాబా పిట్ట గోడ మీద కూర్చుని వుంది.

ఆమె మౌనాన్ని నేను వేరేలా అర్థం చేసుకున్నాను.

''నిన్ను హర్ట్ చేస్తే నన్ను క్షమించు'' అని వెనుదిరగబోయాను.

అప్పుడు కదిలిందామె.

నా అరచేతిని తన ఒడిలోకి తీసు కొంది.

తరువాత-

మెల్లగా-

అతి మెల్లగా-

సుకుమారంగా తన పెదాలతో నా చేతి మీద చుంబించింది- కోటి భావాలకు సంకేతంలా.

●●●●●●

రచయిత చిరునామా:

ఎస్. లక్ష్మీకాంత్

కేర్ ఆఫ్ జయశ్రీ,
లేడీస్ టెయిలర్స్,
రాజేంద్రనగర్, న్యూటౌన్
మహబూబ్‌నగర్
- 509 001

●●●●●●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్